## మినీకథ

# భార్య గండం

వెల్లంకి అనూప్రసాద్



నాకు చాలా భయంగా వుంది. ఇప్పుడింటికి వెళ్ళాక నాపరిస్థితి ఎలావుంటుందీ వూహకందటంలేదు. ప్రొద్దున్నే నిద్రలేవగానే భ్రమరాంబ ముఖం చూసినపుడే అనుకున్నాను. ఇవ్వాళేదో "భార్యగండం" వుందని. అనుకున్నంతా అయింది. గంట క్రితం ఎంతహుషారుగా వున్నాను. సరిగ్గా గంట క్రితం....

* * *

ఆఫీసునుంచి కొంచెం ముందుగా ఇంటికొచ్చాను.

"ఏమండీ! ఇవ్వాళేదన్నా సినిమాకు వెళదామండీ" అంది భ్రమరాంబ.

ఆ మాట అనగానే నాకు స్పృహ తప్పుతుందేమో అనుకున్నాను. కాని సినిమా ఛాన్సు పోతుందేమోనని వెంటనే తేరుకున్నాను. మాఆవిడ ఎప్పుడూ సినిమాలకు వెళదామనదు. నన్ను వెళ్ళనీయదు. సినిమాకు వెళితే అనవసరంగా ఖర్చు తప్ప లాభం వుండదని ఆవిడ అమూల్యమైన అభిప్రాయం.

"ఎన్నాళ్ళకు సినిమాకు వెళదామన్నావు భ్రమా! ఇది నా భ్రమ కాదు కదా. సరే ఈ రోజునే నా ఫేవరేట్ దో కొత్త సినిమా రిలీజయింది. దానికి వెళదాం. అడ్వాన్సు ఇచ్చే టైం అయింది. త్వరగా బయలుదేరు. ఈరోజు నేను టిక్కెట్లెలా తీసానో చూస్కో. నా ప్రతాపం ఏ కప్పుడైనా తెలుస్తుంది."

హాలుదగ్గర కెళ్ళాం. మొదటిరోజు కాబట్టి రష్‌గావుంది. అడ్వాన్సు క్యూ దేశ జనాభాలా పెరిగిపోతూనే వుంది. క్యూలో నుంచుంటే ఫలితం వుండదని. క్యూ మొదట్లో నుంచున్నవాళ్ళ దగ్గరకు వెళ్ళాను. అప్పటికే అక్కడ చాలామంది క్యూలో నిల్చున్నవాళ్ళని.

"ఏమండీ నాక్కూడా ఒకటితీసుకోండి- ప్లీజ్" అని అడుగుతున్నారు.

"మాకూ వున్నాయండి తీసుకోవాల్సినవి. ఎన్ని కావలిస్తే అన్ని ఇస్తాడో. లేదో" అంటున్నారు వాళ్ళు.

"ఫర్లేదండి. ఇస్తేనే తీసుకోండ"ని ఒక్కొక్కరి చేతుల్లో డబ్బులు కుక్కుతున్నారు బలవంతంగా నాలాటివాళ్ళు."

"తప్పుకోండి. లైనుకు దూరంగా జరగండి" అని మమ్మల్నందర్ని అప్పుడే వచ్చిన పోలీసులు దూరంగా తోశారు.

వాళ్ళలో ఒక పోలీసు కూడా అలాగే చెప్పి ఇంకొకరి చేతుల్లో డబ్బులు కుక్కాడు. తనకూ తెచ్చిపెట్టమని.

నేను నెమ్మదిగా ఓ శాల్తీ దగ్గరకు వెళ్ళి అలాగే చెప్పి ఓ ఇరవై రూపాయల నోటు కుక్కాను. అతనికి కౌంటర్‌లో కూర్చున్నతను తెలుసట, తప్పకుండా తెస్తానన్నాడు.

నేను గర్వంగా నా భార్య దగ్గరకు వచ్చి నేచేసిన ఘనకార్యాన్ని వివరించాను విపులంగా. భార్యతో సినిమా విశేషాలు ముచ్చటిస్తూ గమనించాను. నాలాగే చాలా మంది దగ్గర డబ్బులు తీసుకుంటున్నాడు ఆశాల్తీ. "ఫర్లేమలే! బలవంతంగా ఇస్తూండుంటారు. ఏం జేస్తాడు పాపం! అయినా ముందు డబ్బులిచ్చింది నేనేగా. తప్పకుండా తెచ్చిస్తాడ"ని నిర్భయంగా బాతాఖానీ కొట్టాను.

ఆ శాల్తీ ముందుకు కదిలి కౌంటర్‌లో చేయి పెట్టింది. ఇక నాకు సినిమా చూసినంతఆనందంకలిగింది. అంతేకన్నుమూసి తెరవక ముందే ఎటు వెళ్ళాడోగానీ ఆ శాల్తీ గల్లంతయ్యాడు. నేనూ, నాలాగా అతనికి డబ్బులిచ్చిన ఇంకొందరూ ఎంత వెదికినా కనబడలేదు. మేమంతా కనిపెట్టిందొక్కటే. ఆ కౌంటర్ ప్రక్కన చిన్న తలుపుంది. అందులోంచి లోనకి వెళ్ళి అలా తప్పించుకుని వెళ్ళుంటాడనుకున్నాము.

అదీ జరిగింది. భ్రమ ముఖంలో కోపం తాండవిస్తోంది. అయినా ధైర్యంచేసి అడిగాను- ఇంకేదన్నా సినిమాకు వెళదామని.

"వద్దు. వదిలిన తుప్పు చాలు గాని మాట్లాడకుండా రిక్షా ఎక్కండి."

* * *

ఇప్పుడు రిక్షాలో వున్నాను. భ్రమరాంబ మౌనంగా వుంది. ఇంటి కెళ్ళాక కూడా అలాగే వుంటుం దనుకోవడం నా భ్రమే. బహుశా తుఫానొచ్చేముందు వాతావరణంకూడా యిలా ప్రశాంతంగా నే వుంటుందేమో!

★